

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -177 | పేజీలు - 8 | వెల - 03/- | మంగళవారం 6 అక్టోబర్ 2026



ఇంటింటికీ జలధార..

రూ.30,156 కోట్లతో బృహత్ పథకం ప్రారంభించిన చంద్రబాబు, పవన్

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' కు శ్రీకారం
- 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం

ప్రొద్దుటూరు అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు.

ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి మిగతాది 2లో...

పార్టీ .. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం



- రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదని, అభివృద్ధి అని పవన్ కల్యాణ్ వ్యాఖ్య
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నామని వెల్లడి

కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు



- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ
- చట్టవిరుద్ధమైన నిర్ణయాలు ఉంటే రద్దు చేస్తామన్న సుప్రీంకోర్టు ధర్మాసనం

న్యూఢిల్లీ, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్


ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. మిగతాది 2లో...

కలిసి పనిచేస్తాం

భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది -స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్

100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు -ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్



అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతోమిగతాది 2లో...

ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

- మార్చారనేది నిస్సందేహంగా రుజువైంది
- నిబంధనలకు విరుద్ధంగా సీఈసీ నిర్ణయాలు
- సిఈసి జ్ఞానేష్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలి
- ఫారమ్-6 మార్పులపై రాహుల్ తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో ఫారమ్-6 మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసిన వేళ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. మిగతాది 2లో...

మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన

- కార్ల్ డీస్సెరోత్, పీటర్ హెగెమాన్, జార్జ్ నాజెల్‌లను వరించిన పురస్కారం
- ఆప్టోజెనెటిక్స్ అనే టెక్నిక్‌ను అభివృద్ధి చేసినందుకు ఈ గౌరవం
- కాంతిని ఉపయోగించి మెదడులోని నరాల కణాలను నియంత్రించడం దీని ప్రత్యేకత
- జ్ఞాపకాలు, భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో ఈ ఆవిష్కరణ ఒక మైలురాయి



సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

పదోన్నతి పొందిన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీం న్యాయమూర్తులుగా మరో ఇద్దరి నియామకం



రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు



2029 నాటికి 4-స్టార్ స్కూళ్లు

ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష..



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

అమరావతి, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. మిగతాది 2లో...

రేవంత్ సర్కార్ కుట్రలు

వారసత్వ కట్టడాలను కూల్చేసే పన్నాగం

- బొగ్గు గని ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలి
- లేకుంటే పెద్ద ఎత్తున మేం ఉద్యమిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్ : రేవంత్ రెడ్డి సర్కార్ రాష్ట్రంలో భూములు దోచుకోవడం అయిపోయింది. ఇక భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ మేరకు ఎక్స్ లో మిగతాది 2లో...

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

- ప్రత్యేక పాలసీకి తెలంగాణ ప్లాన్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచన
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

హైదరాబాద్, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో మిగతాది 2లో...



మిగతా2లో...

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

మెదడు రహస్యాలను ఛేదించిన ఆప్టోజెనెటిక్స్

వైద్యశాస్త్రంలో 2026 నోబెల్ బహుమతి ముగ్గురికి సంయుక్తంగా ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ పురస్కారాల ప్రకటన ప్రారంభమైంది. 2026 సంవత్సరానికి గాను వైద్యశాస్త్రంలో (ఫిజియాలజీ/మెడిసిన్) ముగ్గురు శాస్త్రవేత్తలు సంయుక్తంగా ఈ అత్యున్నత పురస్కారానికి ఎంపికయ్యారు. అమెరికాకు చెందిన కార్ల్ డీస్సెరోత్ (స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ), జర్మనీకి చెందిన పీటర్ హెగెమాన్ (హంబోల్ట్ యూనివర్సిటీ), జార్జ్ నాజెల్ (వుర్జ్‌బర్గ్ యూనివర్సిటీ) ఈ గౌరవాన్ని దక్కించుకున్నారు. 'కాంతి ఆధారిత అయాన్ చానెళ్లు, ఆప్టోజెనెటిక్స్'పై వారు చేసిన అద్భుతమైన ఆవిష్కరణలకు గాను నోబెల్ కమిటీ వారిని ఎంపిక చేసినట్లు సోమవారం ప్రకటించింది. ఈ ఆవిష్కరణ న్యూరోసైన్స్ (నాడీశాస్త్రం) రంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది.మన మెదడు జ్ఞాపకాలను, భావోద్వేగాలను, ప్రవర్తనలను ఎలా నియంత్రిస్తుందనేది ఎన్నో శతాబ్దాలుగా ఒక పెద్ద మిస్టరీ. 20వ శతాబ్దంలో శాస్త్రవేత్తలు మెదడులోని ఏయే ప్రాంతాలు ఏయే పనులను ప్రభావితం చేస్తాయో పరిశోధించడం మొదలుపెట్టారు. కానీ, అప్పటి పద్ధతులతో కచ్చితమైన కారణాలను నిర్ధారించడం సాధ్యపడలేదు. వారి వద్ద ఉన్న మెదడు చిత్రం, ఎన్నో ప్రశ్నలతో, ఖాళీలతో నిండిన ఒక చిత్తుపటంగానే మిగిలిపోయింది. అయితే, ఆప్టోజెనెటిక్స్ రాకతో ఈ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. "ఒకప్పుడు కల అనుకున్న మెదడును మ్యాపింగ్ చేసే అవకాశాన్ని ఆప్టోజెనెటిక్స్ సాకారం చేసింది" అని నోబెల్ కమిటీ చైర్మన్ పెర్ స్వెన్నింగ్‌సన్ వ్యాఖ్యానించారు.

ఈ అద్భుత ఆవిష్కరణకు పునాది వేసింది పీటర్ హెగెమాన్ జిజ్ఞాస. 'క్లామిడోమోనాస్' అనే ఒకే కణం కలిగిన నాచు (ఆల్గే) కాంతి ఉన్నవైపు ఎలా ఈదగలుగుతోందని ఆయన ఆలోచించారు. 2000ల ప్రారంభంలో, ఆయన తన సహచరుడు జార్జ్ నాజెల్‌తో కలిసి ఆ నాచు కణం ఉపరితలంపై 'ఛానెల్‌రోడాప్సిన్' అనే ఒక ప్రత్యేకమైన ప్రొటీన్‌ను కనుగొన్నారు. దీనిపై నీలి రంగు కాంతి పడినప్పుడు, ఆ ప్రొటీన్‌లో ఒక మార్గం (ఛానెల్) తెరుచుకుని, అయాన్లు కణం లోపలికి ప్రవహించి ఒక విద్యుత్ సంకేతాన్ని సృష్టిస్తాయని వారు గుర్తించారు. ఈ ప్రొటీన్‌ను ఏ కణంలో ప్రవేశపెట్టినా, ఆ కణం కాంతికి స్పందించేలా మారుతుందని నిరూపించారు.ఈ పరిశోధనను కార్ల్ డీస్సెరోత్ మరో స్థాయికి తీసుకెళ్లారు. ఆయన ఛానెల్‌రోడాప్సిన్ జన్యువును ఎలుకల మెదడులోని నరాల కణాలలోకి ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిపై నీలి కాంతిని ప్రసరింపజేసి, నరాల సంకేతాలను విజయవంతంగా ప్రేరేపించగలిగారు. 2005లో ఆయన ఈ ప్రయోగాన్ని ప్రచురించగా, రెండేళ్ల తర్వాత 2007లో బతికున్న ఎలుకల మెదడులో ఈ 'కాంతి ఆధారిత స్విచ్' పనిచేసేలా చేసి సంచలనం సృష్టించారు.

ప్రస్తుతం 'ఆప్టోజెనెటిక్స్' అని పిలుస్తున్న ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా వేగంగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఉపయోగించి పరిశోధకులు నిర్దిష్ట జ్ఞాపకాలు, భయం, ఆనందం వంటి భావోద్వేగాలు, ప్రవర్తనలను నియంత్రించే నాడీ వలయాలను (న్యూరల్ సర్క్యూట్స్) ఛేదిస్తున్నారు. ఇది మానసిక, నాడీ సంబంధిత వ్యాధులపై మన అవగాహనను పెంచుతోంది. వైద్య రంగంలో, దృష్టి లోపం ఉన్నవారికి తిరిగి చూపును అందించే ప్రయత్నాలలో ఈ పద్ధతిపై ప్రయోగాలు జరుగుతున్నాయి. ఆప్టోజెనెటిక్స్ ఆవిష్కరణ మన మెదడుపై ఉన్న అవగాహనను సమూలంగా మార్చేసింది. ఈ సాంకేతికత సాయంతో ప్రతిరోజూ కొత్త ఆవిష్కరణలు వెలుగులోకి వస్తూ, మానవాళి ముందున్న అతిపెద్ద రహస్యాలలో ఒకటైన మన మెదడు పనితీరును అర్థం చేసుకోవడానికి మార్గం సుగమం చేస్తున్నాయి.

2029 నాటికి 4-స్టార్ స్కూళ్లు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.**నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట** విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ జలధార..

(మొదటి పేజీ తరువాయి)

సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్ధన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పార్టీ .. ప్రాంతం కాదు.. ప్రజలే ముఖ్యం

ప్రొద్దుటూరు అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్

"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు.

ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.

2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.

తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.

గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.

రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేవంత్ సర్కార్ కుట్రలు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని అన్నారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాల యానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే కుట్రలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుందని వెల్లడించారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

రామాయపట్నం రిఫైనరీకి కేంద్రం గ్రీన్ సిగ్నల్

1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ప్రాజెక్టు

అమరావతి, అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్ ఆంధ్రప్రదేశ్‌లో మరో భారీ ప్రాజెక్టు నిర్మాణానికి మార్గం సుగమమైంది. నెల్లూరు జిల్లా రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌కు కీలక అడుగు పడింది. ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు చెందిన నిపుణుల అంచనా కమిటీ (ఈఏసీ) పచ్చజెండా ఊపుతూ సిఫారసు చేసింది. ఈ అనుమతితో ప్రాజెక్టు నిర్మాణ పనుల ప్రారంభానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. సుమారు రూ.1,03,408 కోట్ల భారీ అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రామాయపట్నం పోర్టు సమీపంలో దాదాపు 5,200 ఎకరాల భూమిని కేటాయించారు.

కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు.ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు..

(మొదటి పేజీ తరువాయి)

పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

సుప్రీంకోర్టు జడ్జిగా తెలంగాణ హైకోర్టు సీజే

హైదరాబాద్/న్యూఢిల్లీ,అక్టోబర్ 5, రిపబ్లిక్ న్యూస్ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్.. సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన నియామకానికి రాష్ట్రపతి ఆమోదం తెలిపిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌తోపాటు గుజరాత్, ఢిల్లీ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ సునితా అగర్వాల్, జస్టిస్ దేవేంద్రకుమార్ ఉపాధ్యాయలకు కూడా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి కల్పించారు. ఈ ముగ్గురిని సుప్రీంకోర్టు జడ్జిలుగా నియమించాలంటూ సుప్రీంకోర్టు కొలీజియం సెప్టెంబరు 28న కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆ సిఫారసుకు కేంద్రం తాజాగా ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. తాజా నియామకాలతో దేశ సర్వోన్నత న్యాయస్థానం జడ్జిల సంఖ్య 37కు చేరింది. ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తితో కలిపి న్యాయమూర్తుల సంఖ్య 34 ఉండగా.. ఇటీవల సుప్రీంకోర్టు సవరణ చట్టం-2026 ప్రకారం ఈ సంఖ్యను 38కి పెంచారు. కాగా, సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులైన జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ 2025 జూలై 19న తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్?టగా ప్రమాణ స్వీకారం చేశారు. 1965 జూలై 7న జన్మించిన జస్టిస్ ఏకే సింగ్.. ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. 1990లో పాట్నా హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. 1990 నుంచి 2000 సంవత్సరం వరకు పాట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు ఝార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. 2012 జనవరి 24న ఝార్ఖండ్ హైకోర్టు అదనపు జడ్జిగా, 2014లో ఝార్ఖండ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

కలిసి పనిచేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు. భారత్-స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ మధ్య జరిగిన (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఫారం 6ను చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా మార్చారు

(మొదటి పేజీ తరువాయి)

జ్ఞానేశ్ కుమార్ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా ఫారమ్-6లో మార్పులు చేశారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ నేరపూరిత దాడిలో జజుజతో పాటు బాధ్యులైన ప్రతి ఒక్కరినీ జవాబుదారీగా నిలదీస్తామని ఆయన హెచ్చరించారు. జ్ఞానేష్ కుమార్ ఫారం 6ను చట్

గోనెగండ్లను కరువు మండలంగా ప్రకటించాలి!

తాగునీటి సమస్యను పరిష్కరించాలి..
ఉపాధి పనులు కల్పించాలి







ఎమ్మిగనూరు, అక్టోబర్, 5.(ప్రజా రిపబ్లిక్ న్యూస్):
గోనెగండ్ల మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, నెలకొన్న తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీచర్ నాగన్న ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టిన అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కాసిం, ఓబీసీ అధ్యక్షులు శేషాద్రి నాయుడు, రాయలసీమ సాగునీటి కమిటీ కన్వీనర్ నరసప్ప తదితరులు మాట్లాడుతూ మండలంలో అత్యల్ప వర్షపాతం నమోదైనప్పటికీ కరువు మండలంగా ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. వర్షాభావంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి లిఫ్ట్ ద్వారా ఎల్ఎల్‌సీ కాలువలకు నీటిని విడుదల చేసి, గ్రామీణ ప్రాంతాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజలు వలస వెళ్లకుండా తక్షణమే పెద్దఎత్తున ఉపాధి హామీ పనులు చేపట్టాలని అన్నారు.వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పనులు చేపట్టాలని, చెరువులను అభివృద్ధి చేసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని కోరారు. ఎల్ఎల్‌సీ ఆయకట్టు స్థిరీకరణ, పటిష్టతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మాదన్న, రైతులు కర్ణభసప్ప, బోయ రంగస్వామి, కురవ తిమ్మప్ప, చిన్న పెద్దయ్య, చిన్న గంగయ్య, బజారి, కులుమాల హనుమంతు, చిన్న మరివిడి ఏసన్న, కాంగ్రెస్ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతా

బాధ్యతలు స్వీకరించిన ఆళ్లగడ్డ పట్టణ సి ఐ రాము



ఆళ్లగడ్డ అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా రాము పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా పట్టణ సి ఐ మీడియా తో మాట్లాడుతూ ఆళ్లగడ్డ పట్టణంలో శాంతి భద్రతల సంరక్షణ, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఆళ్లగడ్డ టౌన్ సీఐ రాము హెచ్చరించారు. సోమవారం ఆయన నూతన టౌన్ సీఐ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు ఆళ్లగడ్డ సీఐగా భాద్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గతంలో ఆత్మకూరు సీఐ గా పని చేసినప్పుడు ఆత్మకూరులో పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వగా ఐదు మంది అభ్యర్థులకు పోస్టింగ్ రావడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో కూడా మంచి క్రీడా మైదానం ఉండడంతో తాము భవిష్యత్తులో ఇక్కడ కూడా పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సిఐ రాము తెలిపారు. ప్రజలు కేసుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని ఆళ్లగడ్డ పట్టణ ప్రజల భద్రతే తమ లక్ష్యమని సి ఐ రాము వివరించారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

:- బిజెపి మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్

ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలు, సంస్థాగత పటిష్టతపై బీజేపీ మండల సమావేశంలో చర్చ






పాములపాడు అక్టోబర్-5 రిపబ్లిక్ న్యూస్:- బీజేపీ కేంద్ర, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, నంద్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ అభిరుచి మధు గారి సూచనల మేరకు సమావేశం నిర్వహించారు.
మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ అధ్యక్షతన బీజేపీ మండల పదాధికారుల సమావేశం జరిగింది.సమావేశానికి మండల ఇన్‌చార్జ్, సీనియర్ నాయకులు, బీఎల్ఓ-2 దామోదర్ రెడ్డి హాజరై పలు సూచనలు చేశారు.మండలంలోని ప్రజా సమస్యలు, గ్రామాల వారీ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు.బీజేపీ కార్యకర్తల సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహించారు.మండలంలో పార్టీ సంస్థాగత పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు.ఎస్ ఐ ఆర్, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై పదాధికారులకు సూచనలు చేశారు.ఈ నెలలో నిర్వహించాల్సిన పార్టీ కార్యక్రమాలపై కార్యాచరణ రూపొందించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించారు.పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.సమావేశంలో ప్రవీణ్ కుమార్, గోపాలకృష్ణయ్య, రేణుక, మంగళి వెంకటేశ్వర్లు,జూటూరు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, బాలస్వామి, ఏసన్న, లింగాల బ్రహ్మయ్య, రుద్రవరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భారత్ కళా పురస్కార్ 2026అవార్డు అందుకున్న

అహోబిలం దేవస్థానం అస్తాన ఫోటోగ్రాఫర్ ప్రసాద్





ఆళ్లగడ్డ అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్
ఆళ్లగడ్డ తాలూకా అహోబిలం గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అస్తాన ఫోటో గ్రాఫర్ ప్రసాద్ భారత్ కళా పురస్కార్ 2026కు ఎంపికయినారు.
హైదరాబాద్ ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో 2026లో భాగంగా నిర్వహించిన భారత్‌కళపురస్కార్2026 కార్యక్రమంలో బెస్ట్ ట్రెడిషనల్ ఫోటోగ్రాఫర్ విభాగానికి అహోబిలానికి చెందిన యు.వి. పి. వి. ప్రసాద్ ఫోటోగ్రఫీని ఎంపిక చేసి, నామినేషన్‌ను ఆమోదించి అవార్డును ప్రదానం చేశారు.
ఫోటోగ్రఫీ రంగంలో సంప్రదాయ కళ, సంస్కృతి, ఆధ్యాత్మికతకు సంబంధించిన చిత్రాలను తనదైన శైలిలో చిత్రీకరిస్తున్నందుకు ఈ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని ప్రసాద్ తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఫోటో ట్రేడ్ ఎక్స్‌పో2026లో పాల్గొని భారత్ కళా పురస్కార్2026ను అందుకోవడం తనకు ప్రత్యేక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా అవార్డు కార్యక్రమానికి సహకరించిన ఎడిట్ పాయింట్, వందే భారత్, పీపీఐఎన్ ఫోటో పరివార్ ఇండియా నెట్‌వర్క్ వారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సహకారం అందించిందని ప్రసాద్ తెలిపారు.

65 రోజుల నిర్బంధం దుర్మార్గం

విరూపాక్షిపై కేసులు ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలి: కె. రామకృష్ణ





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5) ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షిపై అక్రమ కేసులు నమోదు చేసి 65 రోజులుగా జైలులో నిర్బంధించడం దుర్మార్గమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ మండిపడ్డారు. వెంటనే కేసులు ఉపసంహరించుకుని ఎమ్మెల్యేను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పంచలింగాల సబ్‌జైలులో విరూపాక్షిని కె. రామకృష్ణతో పాటు సీపీఐ నాయకులు ములాఖత్ అయ్యారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ, గతంలో ఎలాంటి కేసులు లేని విరూపాక్షిపై అక్రమ కేసులు పెట్టి జైలులో నిర్బంధించడం అన్యాయమన్నారు. మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన బీసీ నాయకుడిని ఇలా నిర్బంధించడం రాష్ట్ర ప్రభుత్వానికి అవమానకరమన్నారు.విరూపాక్షితో పాటు మరో 44 మందిని జైలులో నిర్బంధించడాన్ని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖ రాసి కేసులు ఉపసంహరించుకుని విడుదల చేయాలని కోరనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

24 గంటల్లోనే జేసీబీ దొంగతనం కేసు ఛేదింపు చేసిన సీఐ పి. శేషయ్య

రెండు జేసీబీలు, కత్తి, నకిలీ తాళంచెవులు స్వాధీనం



కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద దొంగతనానికి గురైన రెండు జేసీబీల కేసును కర్నూలు 3 టౌన్ పోలీసులు 24 గంటల్లోనే ఛేదించారు. ఈ కేసులో బుధవారపేట హబీబ్ ముబారక్ నగర్‌కు చెందిన చిన్నపోగు పవన్‌కుమార్ అలియాస్ పవన్ (27)ను పోలీసులు అరెస్టు చేశారు.కర్నూలు జిల్లా ఆస్పరి మండలం ములుగుండం గ్రామానికి చెందిన ఆవుల మృత్యుంజయుడు, ఆయన సోదరుడు ఆవుల ప్రభాకర్‌కు చెందిన రెండు జేసీబీలను నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద నిలిపి ఉంచగా, అక్టోబర్ 2, 3 తేదీల్లో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో కర్నూలు 3 టౌన్ పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూలు ఎస్‌డీపీవో పర్యవేక్షణలో 3 టౌన్ సీఐ పి. శేషయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో బుధవారపేటకు చెందిన పవన్‌కుమార్‌పై అనుమానం రావడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల విచారణలో మద్యం, ఇతర ఖర్చుల కోసం డబ్బు అవసరమై జేసీబీలను దొంగతనం చేసినట్లు నిందితుడు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. దొంగతనం సమయంలో ఎవరైనా అడ్డుకుంటే కత్తితో బెదిరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కూడా విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు. నకిలీ తాళంచెవితో నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఉన్న రెండు జేసీబీలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు.రెండో జేసీబీని నదుపుకుంటూ నంద్యాల వైపు వెళ్తున్న సమయంలో మార్గమధ్యంలో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి వాటిని ధ్వంసం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రెండు జేసీబీలు, ఒక కత్తి, నకిలీ తాళంచెవులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.ఎరెండు కేసులు నమోదైన 24 గంటల్లోనే కేసులను ఛేదించి జేసీబీలను రికవరీ చేసిన కర్నూలు ఎస్‌డీపీవో, 3 టౌన్ సీఐ పి. శేషయ్యతో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం: జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. కె. వెంకటేశ్వర్లు



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. తమ సమస్యలు, డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సూపరింటెండెంట్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను సూపరింటెండెంట్‌కు వివరించారు. ఉద్యోగుల నుంచి వచ్చిన వినతిని డాక్టర్ కె. వెంకటేశ్వర్లు సానుకూలంగా స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విన్నారు.ఉద్యోగులు పేర్కొన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలి

రైతుల సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోంది: ఎస్వీ మోహన్‌రెడ్డి

ప్రకటించకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరిక



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరికి రైతు సంఘం నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, అయినప్పటికీ కరువు మండలాల ఎంపికలో 12 మండలాలను విస్మరించారని ఆరోపించారు. కేవలం వర్షపాతం ఆధారంగా లెక్కలు వేయడం వల్ల క్షేత్రస్థాయిలో నెలకొన్న వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించలేదని అన్నారు. ఎల్ఎల్‌సీ ద్వారా రైతులకు సకాలంలో సాగునీరు అందకపోవడంతో పాటు తుంగభద్ర నది నుంచి అవసరమైన నీటిని వినియోగించుకోలేకపోవడం వల్ల మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఆలూరు, దేవరకొండ మండలాల్లో వర్షాభావం కారణంగా తాగునీరు, పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పడిందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం సరైన నిర్ణయం కాదని అన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

రైతులకు పంటల బీమా, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాల పంపిణీ వంటి చర్యలు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేశామని ఎస్వీ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం పంటల బీమా విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు.పంటలు వేసుకుని నష్టపోయిన ప్రతి రైతుకు రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, పంటలు సాగు చేయలేని రైతులకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో రైతుల వలసలను అరికట్టేందుకు ఉపాధి హామీ పథకం కింద పనిదినాలను పెంచాలని కోరారు.
కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతో పాటు రైతులకు తక్షణమే ఉపశమన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే జిల్లాలోని అన్ని మండలాల రైతులను సమీకరించి రైతుల పక్షాన ఉద్యమం చేపడతామని ఎస్వీ మోహన్‌రెడ్డి హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి భరత్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గణపురం శ్రీనివాస్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు మోహన్‌గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలకల్లు గ్రామంలో కుల వివక్షపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

సివిల్ రైట్స్ డేలో వెలుగులోకి వచ్చిన సమస్యలపై డీవీఎంసీ సభ్యురాలు గొందిపల్లె మాలతి ఆవేదన

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
కర్నూలు జిల్లా సి.బెళగల్ మండలం పోలకల్లు గ్రామంలో కుల వివక్షకు సంబంధించిన పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయని డీవీఎంసీ సభ్యురాలు గొందిపల్లె మాలతి తెలిపారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరిని కలిసి ఆమె ఫిర్యాదు చేశారు.

పోలకల్లు గ్రామంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమానికి తహసీల్దార్ వెంకటలక్ష్మితో కలిసి తాను హాజరైన సందర్భంగా స్థానిక ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారని మాలతి తెలిపారు. గ్రామంలో కొందరు ప్రజలను ఆలయంలోకి అనుమతించడం లేదని, శుభకార్యాల సమయంలో బ్యాండ్ మేళం, సన్నాయి మేళం వంటి సేవలు అందించేందుకు గ్రామానికి చెందిన వారు ముందుకు రావడం లేదని స్థానికులు తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. దీంతో ఆయా సేవల కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోందన్నారు.అదేవిధంగా క్షవరం, జుట్టు



కత్తిరించుకోవడం, గడ్డం చేయించుకోవడం వంటి సాధారణ సేవలు కూడా గ్రామంలో అందుబాటులో లేకపోవడంతో పక్క గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందని బాధితులు తెలిపినట్లు మాలతి వెల్లడించారు.టీ హోటళ్ల విషయంలోనూ వివక్ష ఎదురవుతోందని స్థానికులు ఆరోపించినట్లు ఆమె తెలిపారు. తాము హోటళ్లకు వెళ్లినప్పుడు వివక్ష చూపడంతో పాటు, హోటల్ యజమానులను బెదిరించి హోటళ్లు మూసివేయించే పరిస్థితులు ఉన్నాయని బాధితులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. అయితే ఇతర కులాలకు చెందిన వారు అదే హోటళ్లలో కూర్చొని తిని వెళ్లినా ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం కావడం లేదని స్థానికులు పేర్కొన్నట్లు తెలిపారు.“ఒక వర్గానికి ఒక న్యాయం.. మరో వర్గానికి మరో న్యాయం ఎందుకు?” అని ప్రశ్నిస్తూ ఈ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లు మాలతి తెలిపారు. గ్రామంలో చోటుచేసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఆమె జిల్లా కలెక్టర్‌ను కోరారు.ప్రతి గ్రామంలో సివిల్ రైట్స్ డేను క్రమం తప్పకుండా నిర్వహించాలని, ఈ కార్యక్రమాల్లో డీవీఎంసీ సభ్యులను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. పోలకల్లు గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించడం సంతోషకరమైన విషయమేనని, అయితే ఇలాంటి కార్యక్రమాల ద్వారా వెలుగులోకి వచ్చే ప్రజా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గొందిపల్లె మాలతి కోరారు.

అంగన్వాడి కేంద్రాలలో “మిలన్ సేవా కల“ కార్యక్రమం

బిజెపి ఆధ్వర్యంలో అంగన్వాడి సిబ్బందికి ఘనంగా సన్మానాలు

పాములపాడు అక్టోబర్-5 రిపబ్లిక్ న్యూస్:- భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయన ప్రజా జీవితంలో 25 సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని స్మరించుకుంటూ చేపట్టిన “సేవా సంకల్ప అభియాన్ లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో “అంగన్వాడి మిలన్ సేవా కల” కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.బీజేపీ పాములపాడు మండల అధ్యక్షులు రాయపాటి మురళీమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాములపాడు మండలంలోని, పాములపాడు, ఇస్కాల, లింగాల, తుమ్మలూరు, జూటూరు గ్రామాల్లో ఎన్నో సంవత్సరాలుగా సేవలందిస్తున్న అంగన్వాడి టీచర్లను, హెల్పర్లను గౌరవిస్తూ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.
అంగన్‌వాడీ కేంద్రాల్లోని, చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు



మరియు పోషకాహారాన్ని పంపిణీ చేస్తారు.
చిన్నారులకు పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య అందించడంతో పాటు వారి ఉజ్వల భవిష్యత్తుకు అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్లు చేస్తున్న సేవలు అభినందనీయమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అంగన్వాడి సిబ్బంది అందిస్తున్న సేవలను గుర్తించి వారిని సన్మానించడం సంతోషంగా ఉందన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చల్లా దామోదర్ రెడ్డి, మండల పదాధికారులు ప్రవీణ్ కుమార్, గోపాలకృష్ణయ్య, రేణుక, మంగళి వెంకటేశ్వర్లు, జూటూరు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, బాలస్వామి, ఏసన్న, లింగాల బ్రహ్మయ్య, రుద్రవరం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేంపెంట జడ్పీ హైస్కూల్లో జరిగిన ఎస్ఎంసి ఎన్నికలలో

సింగపూర్ టేకూరి నాగేష్ అభ్యర్థులు ఘనవిజయం

వేంపెంట టీడీపీ అధ్యక్షురాలు, మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మకు ఘనంగా సన్మానం చేసిన విజేతలు

పాములపాడు అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్:-పాములపాడు మండలంలోని, వేంపెంట గ్రామంలోని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం.రఫిక్ అహమ్మద్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, మెంబర్స్ ఎన్నికలలో టేకూరి రామసుబ్బమ్మ బలపరిచిన బోనపల్లె సురేష్, శీలం లక్ష్మీదేవి ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులు వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ కి శాలువాలు కప్పి, పూలమాలలు మెడలో వేసి ఘనంగా సన్మానించారు. ప్రజల్లో మంచి పేరు, ఆదరణ ఉన్నంతవరకు ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా విజయాన్ని అడ్డుకోలేరని మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ పేర్కొన్నారు. ప్రజలే తమ తీర్పుతో వారికి తగిన సమాధానం ఇచ్చారని ఆమె తెలిపారు. తమ మద్దతుతో అభ్యర్థులను గెలిపించిన విద్యార్థుల తల్లిదండ్రులకు, వేంపెంట గ్రామ ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ ఎస్ఎంసి



ఎన్నికలలో ఎలాంటి ఘర్షణలు, ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేందుకు సహకారం అందించిన నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కి, ఆత్మకూరు డీఎస్పీ ఆర్.రామాంజీ నాయక్ కి, రూరల్ సీఐ ఎం.సురేష్ కుమార్ రెడ్డి కి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గెలుపొందిన అభ్యర్థులకు సింగపూర్‌లో నివసిస్తున్న వరల్డ్ హ్యూమన్ రైట్స్ అవార్డు గ్రహీత డాక్టర్ టేకూరి.నాగేష్ శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్ మరియు స్కూల్ కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. అదేవిధంగా పాఠశాలకు అవసరమైన పనులను తమ వంతుగా చేపడతామని సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు & అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి.నాగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించకపోవడంతో

భగ్గుమన్న మండల రైతాంగం..

కరువు మండలంగా ప్రకటించాలంటూ గంటన్నర పాటు టర్నింగ్ లో రాస్తారోకో నిర్వహించిన మండల రైతాంగం..

మండలంలో తీవ్రమైన కరువు నెలకొంది కరువు మండలంగా ప్రకటించండి

ప్రభుత్వం ఆదుకోకపోతే రైతుల పరిస్థితి అగమ్య గోచరం

కరువు ప్రకటించే వరకు పోరాటం కొనసాగిస్తాం.....

దేవనకొండ అక్టోబర్ 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
కరువు మండలాల ప్రకటనలో శాస్త్రీయత లేకుండా అశాస్త్రీయంగా కరువు మండలాల ప్రకటన చేశారని దేవనకొండ మండలం కరువుగా ప్రకటించకపోవడం ఈ మండల రైతాంగానికి తీవ్రమైన నష్టమని ప్రభుత్వం వెంటనే దేవనకొండ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి మండల రైతులను, ప్రజానీకాన్ని, కూలీలను ఆదుకోవాలని సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గౌస్ దేశాయ్, గిడ్డయ్య, వైసీపీ రాష్ట్ర నాయకులు సురేంద్ర రెడ్డి లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దేవనకొండ మండలాన్ని కరువు మండలం గా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ మండల రైతాంగంతో సిపిఐ, సిపిఎం పార్టీలు దేవనకొండ టర్నింగ్ దగ్గర రోడ్డు దిగ్బంధన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి వైసిపి పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వం మరియు కాంగ్రెస్ పార్టీలు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఈసందర్భంగా సిపిఎం, సిపిఐ పార్టీల మండల కార్యదర్శులు బి.వీర శేఖర్, యం.నరసరావు ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..కరువు పై శాస్త్రీయత ఉందని చెబుతున్న అధికారులు కర్నూల్ అర్బన్, ఆదోని-1 వంటి అర్బన్ కేంద్రాలను కరువుగా ఎలా ప్రకటిస్తారని ఆరోపించారు. ఆయా ప్రాంతాలలో పంట పొలాల్లో ఏ మేరకు విస్తీర్ణం ఉందో ప్రభుత్వానికి, అధికారులకు తెలుసా అని వారు ప్రశ్నించారు. 100 హెక్టార్ల భూమి కూడా లేని ఆ ప్రాంతాలలో



కరువు ప్రకటించడం అధికారుల అలసత్వానికి నిర్లక్ష్యానికి నిదర్శనమని వేల హెక్టార్లో దేవనకొండ మండలంలో సాగుచేసిన రైతులను అధికారులు ప్రభుత్వం నిండా ముంచిందని వారు విమర్శించారు. నిజంగా అధికారులకు ప్రభుత్వ పెద్దలకు చిత్తశుద్ధి ఉంటే దేవనకొండ మండలంలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులకు సమాధానం చెప్పడానికి గ్రామాల పర్యటించాలని వారు పేర్కొన్నారు. ఎలాంటి శాస్త్రీయత లేకుండా కరువు మండలాల ప్రకటించడంపై అధికారులపై గౌరవం పోయే విధంగా ఉందని పేర్కొన్నారు. కరువు మండలాల ప్రకటనలో చాలా బాధ్యతారహితంగా ప్రభుత్వము అధికారులు వ్యవహరించారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి మండల రైతాంగానికి న్యాయం చేయాలని కరువు నష్టపరిహారము,100% పంటల బీమా అదే విధంగా పంట రుణాల మాఫీ, ఉపాధి పనులు, పశువులకు పశుగ్రాసం, మండలంలోని చెరులన్నిటికీ సాగు నీటిని హంద్రీ-నీవా ద్వారా నింపాలని వారు డిమాండ్ చేశారు. కరువు మండలాల ప్రకటనలో దేవనకొండ మండలాన్ని కరువుగా ప్రకటించకపోతే ఈ మండల రైతాంగం పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని, ప్రభుత్వం కరువైన ప్రకటించాలా లేకపోతే మండల ప్రజలకు తిండి అయిన పెట్టాలని వారు డిమాండ్ చేశారు దశలవారీగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించేంతవరకు రైతులతో కలిసి ఉద్యమిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రామకృష్ణ (కిట్టు) సిపిఐ,సిపిఎం జిల్లా నాయకులు మద్దిలేటి శెట్టి, నబి రసూల్,ఆనంద్ బాబు, వైసీపీ నాయకులు ఆలూర్ దీన్నే ప్రభాకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజారెడ్డి, తపాల శ్రీనివాసులు ,అరుణ్ కుమార్ ,నారాయణ రెడ్డి, ఆస్పరి జడ్పిటిసి మాజీ జడ్పిటిసి దొరబాబు, ఎల్కే శీను ,పరమేష్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వామపక్ష పార్టీల కార్యకర్తలు శ్రీనివాసులు కాశీము శంకరయ్య అశోక్ యూసుఫ్ భాస్కర్ కృష్ణ బజారి నరసింహులు మహబూబ్ బాషా మహేంద్ర పాండు శ్రీనివాసులు బజారి దొడ్డప్ప సుధాకర్ పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బాల్యవివాహాలను అరికట్టాలి.. -అంగన్‌వాడీ ఉత్సవంలో అవగాహన



మంత్రాలయం , అక్టోబర్ 5 (ప్రజారిపబ్లిక్ న్యూస్): పోషకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బూదూరు అంగన్‌వాడీ సెంటర్-1 టీచర్ హుస్సేన్‌అమ్మ అన్నారు. సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ ఉత్సవం నిర్వహించి గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హుస్సేనమ్మ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బాల్యవివాహాలు అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయా చిన్న లక్ష్మి, గర్భిణులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు నూతన డీఎస్పీగా ఏ. శ్రీనివాసులు బాధ్యతలు

ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ



కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
ఎమ్మిగనూరు సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా ఏ. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కర్నూలు టూ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు నూతన డీఎస్పీ పూల మొక్కను అందజేశారు. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందిస్తూ, శాంతిభద్రతలను కాపాడేందుకు సమన్వయంతో పనిచేయాలని డీఎస్పీకి ఎస్పీ సూచించినట్లు జిల్లా పోలీస్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

పసుపుల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. పసుపుల గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీలక్ష్మి (ఎల్‌సీపీఓ) మాట్లాడుతూ ‘బాల్య వివాహరహిత భారత్’ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడమేనని తెలిపారు. బాల్య వివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటిని అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. ఆర్‌సీహెచ్ఎల్ సూపర్‌వైజర్ పి. నరసింహారాజు మాట్లాడుతూ గ్రామస్తులందరూ బాల్య వివాహాలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. గ్రామంలో బాల్య వివాహానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.అనంతరం పసుపుల గ్రామ మహిళా పోలీస్ సిబ్బంది డి. శ్రావణి, ఎస్. పర్వీన్ బేగం ఆధ్వర్యంలో గ్రామస్తులతో ‘ బాల్య వివాహరహిత భారత్’ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జి. షైనీ దీవెన (ప్రేమి (ఏఎన్ఎం), ఆర్‌సీహెచ్ఎల్ సిబ్బంది కె. నాగ హుస్సేని, బి. ఉమామహేశ్వరి, ఇ. ప్రవల్లిక, పసుపుల గ్రామ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్. సువర్ణమ్మ, జేకే. ఉమ, బి. వనుమక్కతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి

ఉయ్యాలవాడలో ‘చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్’పై అవగాహన





ఓర్వకల్ (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5) మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో కోనేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ‘చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ విలేజ్’ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్ మునిస్వామి మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి గ్రామాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు, తల్లిదండ్రులు, యువత, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.డిస్ట్రిక్ట్ చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సూపర్వైజర్ కే. విమల మాట్లాడుతూ బాల్యవివాహాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్యవివాహం జరుగుతున్నట్లు సమాచారం ఉంటే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు తెలియజేయాలని, పిల్లల హక్కుల పరిరక్షణకు అందరూ సహకరించాలి అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం జరిపించాలి లేనియెడల అమ్మాయి తల్లిదండ్రులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష దీనితోపాటు లక్ష రూపాయల జరిమానము విధించును అలాగే కళ్యాణమండపం వారికి బ్యాండ్ మేళం వారికి టెంట్ హౌస్ వారికి వంట మనుషులకు పెళ్లి నిర్వహణకు మద్దతుదారులకు అందరికి శిక్షింపబడతారు అని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కే. వెంకటేష్ నాయక్, మహిళా పోలీస్ ఎం. షబానా పర్వీన్, ఏఎన్ఎం ఎస్. పరిమళమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ టి. మహేశ్వరమ్మ, డి. అనిత, డబ్ల్యూఈఏ ఎన్. సరోజమ్మ, ఆశా వర్కర్లు బి. జయంతి, ఎస్. తిరుమలదేవి, బి. పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు బి. వరలక్ష్మి, కే. రేణుక, బి. వెంకటేశ్వరి, జి.వి. శివమ్మ, గ్రామ పెద్దలు వి. కృష్ణయ్య చౌదరి, ఆర్. మద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

కార్మికుల హక్కులు కాపాడాలి

కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ మహాధర్నా - పాత సంక్షేమ పథకాలన్నీ పునరుద్ధరించాలని డిమాండ్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 05,(రిపబ్లిక్ న్యూస్)





భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పేరుతో ఉన్న పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ డిమాండ్ చేసింది. కార్మికుల హక్కులను పునరుద్ధరించాలంటూ సోమవారం అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ బీఓసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. అంతకుముందు సంగమేష్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఒకేరోజు ఆందోళనలు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు వినతిపత్రం అందజేశారు.భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ ప్రమాదాల బారినపడుతున్న కార్మికులకు కనీస భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నగర కార్యదర్శి ఎర్రి స్వామి పేర్కొన్నారు. ప్రమాద బీమాను రూ. 10 లక్షలకు పెంచాలని, కార్మిక కుటుంబాలకు అండగా నిలిచేలా సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.కార్మికుల కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు పెళ్లి కానుక, మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం, పిల్లల చదువులకు ఆర్థిక సాయం, వృద్ధాప్యంలో పెన్షన్ అందించాలని కోరారు. 1996లో సంక్షేమ బోర్డు ద్వారా అమలైన 14 సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలని స్పష్టం చేశారు.





అందులో భాగంగా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం పార్లమెంట్ చట్టబద్ధమైన హక్కులు కల్పించినప్పటికీ వాటిని సమర్థంగా అమలు చేయడం లేదని ఐఎఫ్‌టీయూ నాయకులు ఆరోపించారు. పాత చట్టాలను కొనసాగిస్తూ, గతంలో అమలైన విధానంలోనే కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలు అందించాలని డిమాండ్ చేశారు.రోజువారీ కూలీపై ఆధారపడే భవన నిర్మాణ కార్మికులకు సామాజిక భద్రత లేకపోతే వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటాయని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.మహాధర్నాకు వివిధ ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టప్ప, జిల్లా అధ్యక్షుడు రాయుడు, పట్టణ పేదల సంఘం జిల్లా అధ్యక్షుడు వీరినారప్ప, ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, ఎల్‌బీనగర్ భాష, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, నగర కార్యదర్శి శంకర్, బీఓసీ జిల్లా కమిటీ సభ్యులు బి.నాగరాజు, కటారి రాజు, మున్నా, ధనంజయ, నజీర్, పామిడి నుంచి రంగనాయకులు, వెంకటేశులు, తిరుపాలు, కూడేరు నుంచి సంజప్ప, గంగాధర, అంబేద్కర్‌నగర్ కాలనీ నుంచి లలితాబాయి, శోభక్క తదితరులు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ టౌన్ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, అంజి, రాజశేఖర్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల రూపురేఖలు మారుతాయి

సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, క్లస్టర్ ప్రభాకర్



చిప్పగిరి, అక్టోబర్, 5,(రిపబ్లిక్ న్యూస్)



పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల రూప రేకులు మారుతాయని సొసైటీ చైర్మన్ కొండ రామాంజనేయులు, క్లస్టర్ ప్రభాకర్ తెలిపారు, సోమవారం చిప్పగిరిలో 3.0 కార్యక్రమం నిర్వహించి సిసి రోడ్డుకు భూమి పూజ నిర్వహించారు, చైర్మన్ మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గం ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి సహకారంతో గ్రామాల్లో సిసి రోడ్లు వచ్చాయని వైకుంఠం జ్యోతి అంటే అభివృద్ధి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండా పురుషోత్తం ,వైకుంఠ లక్ష్మణ్ చౌదరి, దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ దేవక్క గారి జయన్న ,మాజీ సర్పంచ్ దాసరి గోవిందరాజులు, విద్యా కమిటీ చైర్మన్ రామాంజనేయులు, బూత్ ఇన్చార్జి శ్రీనివాసులు, యూనిట్ ఇన్చార్జి గోవిందరాజులు నగేష్ వెంకటేష్, వ్యాపమాను రంజిత్ ,బడికి మల్లయ్య, గోపాల్, జనసేన నాయకులు నవీన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం.

రైల్వే కోడూరు అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్.



రైతుల, ప్రజల సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మండల తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు అన్నారు, సోమవారం తాసిల్దార్ ఛాంబర్ లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ప్రజా సమస్యల పై విఆర్ఓలకు సంబంధిత అధికారులకు సూచించారు, స్పందన కార్యక్రమంలో తహసీల్దార్ సిద్దేశ్వరరావు ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు, అనంతరం పరిశీలించి తాసిల్దార్ మాట్లాడుతూ ప్రజలు,రైతులు సమస్యలతో మీ దృష్టికి వచ్చిన వెంటనే న్యాయమైన వారి సమస్యలను సత్వరమే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేందుకు కృషి చేయాలని తద్వారా రైతులు ఆఫీసుల చుట్టూ రావలసిన అవసరం ఉండదన్నారు,ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు,స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి త్వరితగతిన పరిష్కార మార్గాలు చూపుతామని తెలిపారు. భూమి కొలతలు, ఇంటి స్థలాలు, ఆన్‌లైన్, మ్యూటేషన్, ఆధార్ కార్డు, మార్పులు తదితర అంశాలకు సంబంధించిన వినతులు అందాయని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ మల్లికార్జునరెడ్డి, వీఆర్వో రాంబాబు, అంబారపు శ్రీనివాసులు, లక్ష్మయ్య, శంకరయ్య ,మనోహర్ , వీఆర్వోలు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నల్లరాళ్లగుట్టకాలనీ వాసుల తాగునీటి సమస్య పరిష్కరించండి.

రైల్వే కోడూరు అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్.



మండల కేంద్రం ఓబులవారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న నల్లరాళ్లగుట్ట కాలనీలో కొన్ని నెలలుగా కొనసాగుతున్న త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ సీనియర్ నాయకులు జమీర్ అక్బర్ బాషా, ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం ఎంపీడీవో ఎంవీఎన్ రాజేంద్రకు వినతి పత్రం అందజేశారు, మండల అభివృద్ధి కార్యాలయానికి సుమారు ఒక కిలోమీటర్ పైన దూరంలో ఉన్న నల్ల రాళ్ల గుట్ట దగ్గర కులాలకు మతాలకు అతీతంగా ఇల్లు లేని పేదలకు ఆ ప్రాంతంలో ప్రభుత్వము ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి వసతి గృహాలను మంజూరు చేయడం కూడా జరిగినది కొంతమంది ఆ ప్రాంతంలో ఇల్లు కట్టుకునేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు . ఎందుకనగా నల్లరాల్ల గుట్ట కావడం వల్ల కొందరు అక్కడ ఇల్లు కట్టుకోలేదు కొంతమంది తప్పనిసరి పరిస్థితుల్లో ఇల్లు కట్టుకున్నారు అక్కడ విద్యుత్తు తాగునీరు సౌకర్యం కల్పించారు కానీ మౌలిక సదుపాయాలు సరైన పద్ధతిలో ఉపయోగించకపోవడం వల్ల అక్కడ త్రాగునీటి సమస్య ఏర్పడింది,కాలనిలో తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ పగిలిపోవడంతో కొన్ని నెలలుగా పంచాయతీ నీటి సరఫరా నిలిచిపోయిందని వారు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లడం జరిగినది,సమస్యను పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం లభించలేదని గ్రామస్థులు వాపోయారు,

వినతి పత్రంపై ఎంపీడీవో ఎంవీఎన్ రాజేంద్ర వెంటనే స్పందించి సమస్యను తక్షణమే పరిష్కరించి గ్రామస్థులకు తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిశివప్రసాద్ కి, సంబంధిత శాఖ ఏఈ కి, సంబంధిత అధికారులను ఆదేశించారు. పనులను ఆలస్యం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు.
అంతేకాకుండా మండలంలోని 22 పంచాయతీల్లో ఎక్కడైనా తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య సమస్యలు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ రామ్మోహన్ రెడ్డి, డిప్యూటీ ఎండిఓ స్వర్ణ గ్రామం కృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ ఆంజనేయ ప్రసాద్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ పలువురు పంచాయతీ అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్‌ను తొలగించాలి

ఎంఈఓకు విద్యార్థి సంఘాల వినతి

మంత్రాలయం, అక్టోబర్ 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):



చిలకలడోన ఎంపీపీఎస్ పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని ఆరోపిస్తూ స్కావెంజర్ మాణిక్యమ్మను తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మంత్రాలయం ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆర్‌పీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది, పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్ మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రతపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. స్కావెంజర్ విధులపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కర్నూలు అర్బన్‌లో ఘనంగా 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు

ముగింపు దశకు చేరుకున్న వేడుకలు.. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై విస్తృత అవగాహన

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)





కర్నూలు అర్బన్ ప్రాజెక్ట్ ఫస్ట్ సెక్టార్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెల రోజులుగా అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమాలు ఈ నెల 8వ తేదీతో ముగియనున్నాయి. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అంగన్వాడీ సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించారు. రోజువారీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలను అధికంగా తీసుకోవడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభిస్తాయని అంగన్వాడీ ఉపాధ్యాయులు వివరించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల తల్లులు, పిల్లల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను నివారించవచ్చని సూచించారు.
అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా అందజేస్తున్న పౌష్టికాహార సరుకులను సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించారు. వాటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలకు పలు సూచనలు అందించారు.
ముగింపు వేడుకల్లో సెక్టార్ సూపరివైజర్ మాణిక్యమ్మతో పాటు అంగన్వాడీ టీచర్లు రుక్మిణి, సువర్ణ, మంజులదేవి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జల జీవన్ మిషన్‌తో ఇంటింటికీ కొళాయి

రూ.1.34 కోట్లతో పైపులైన్ పనులకు శ్రీకారం

గుత్తి అక్టోబర్ 5(రిపబ్లిక్ న్యూస్)



గుత్తి మండలం కొత్తపేట గ్రామంలో జల జీవన్ మిషన్ ‘అమరజీవి జలధార’ కార్యక్రమాన్ని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోమవారం ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం రూ.1.34 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పైపులైన్, ఇంటింటికీ కొళాయి పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాలకు శుద్ధి చేసిన రక్షిత మంచినీటిని కుళాయిల ద్వారా అందించడమే జల జీవన్ మిషన్ లక్ష్యమన్నారు. వేసవిలో బోర్లు ఎండిపోవడం, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాల్సిన పరిస్థితులను తగ్గించేందుకు ఈ పథకం దోహదపడుతుందన్నారు. గ్రామస్థాయిలో తాగునీటి సరఫరాను స్థానిక పాణీ సమితులు, గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) శాఖల సమన్వయంతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికీ సురక్షిత మంచినీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎం.కె. చౌదరి, వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, మండల అధ్యక్షుడు లక్ష్మీరంగయ్య, రవితేజ, నారాయణస్వామి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు శ్రీనివాసులు, రమేష్, రంగారెడ్డి, మాజీ సర్పంచి శ్రీనివాస్ చౌదరి, లక్ష్మీనారాయణ, సుధాకర్, సూరి, ఇసాక్, రాముడు, స్టోర్ డీలర్ సూరి, చంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ కిరణ్, సంబంధిత ప్రభుత్వ అధికారులు, కొత్తపేట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాములపాడులో కేజీబీవీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గిత్త.జయసూర్య



పాములపాడు అక్టోబర్-5 రిపబ్లిక్ న్యూస్:-మండల కేంద్రమైన పాములపాడులో, నందికొట్కూరు నియోజవర్గ ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కస్తూర్బా గాంధీ బాలికల జూనియర్ కళాశాల వసతి గృహ భవనాన్ని ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్త.జయసూర్య మాట్లాడుతూ ఏడబ్ల్యుపి అండ్ బి నిధుల కింద,167.50 లక్షల అంచనా తో ఈ వసతి గృహ భవనాన్ని నిర్మించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాలిక విద్యను ప్రోత్సహించడానికి పాఠశాలలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఈ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో బడి మధ్యలో మానేవేసిన డ్రాపౌట్స్ బాలికలు, బాల కార్మికులు, ఆరవ తరగతి నుండి ఇంటర్ వరకు మంచి విద్య, భోజన వసతితో బాగా చదువుకోవచ్చు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య కేజీబీలో విద్యార్థులకు పెడుతున్న భోజనాలను, వసతిని అన్ని తనిఖీ చేయడం జరిగింది. విద్యార్థులను మెనూ ప్రకారం మంచి పోషకాహారము అందించాలని, విద్యార్థులను తమ సొంత పిల్లలుగా అందరు సిబ్బంది చూసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్, టిడిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, వేంపెంట గ్రామ మాజీ సర్పంచ్ టేకూరి.రామసుబ్బమ్మ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జి.హరిప్రసాద్ యాదవ్, డివిఎంసి మెంబర్ లింగాల నాగరాజు, పాములపాడు సింగిల్ విండో చైర్మన్ సి.గోవిందు, మద్దూరు సింగిల్విండో చైర్మన్ జనార్దన్ రెడ్డి, కాంట్రాక్టర్ బానకచర్ల సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు మద్దూరు తిమ్మారెడ్డి, భానుముక్కల బండ్లమూరి వెంకటేశ్వరరావు, ఎర్రగుడూరు చెల్లె హరినాథరెడ్డి, శివ శంకర్ స్వామి, ఎంఈఓ-1 బాలాజీ నాయక్, జిసిడివో టి.జ్యోతి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.రాజ్యలక్ష్మి, డిటి పఠాన్ బాబు, ఎస్సై పి.తిరుపాలు, ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్, ఎంఈఓ-2 బి.గోపాల్, వివిజి రామ్ జి ఏపీవో బి.జయంతి, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్కూల్ అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

రైతులభూములు తీసుకున్నారు.. పరిహారం మాత్రం ఇవ్వలేదు!

పరిశ్రమల కోసం భూములు స్వాధీనం.. పరిహారం, ఉద్యోగాలు రెండూ దక్కలేదు

ఎన్.కొంతలపాడు రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

కర్నూలు, ప్రతినిధి, అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్):



పరిశ్రమల ఏర్పాటుతో తమ గ్రామానికి అభివృద్ధి, కుటుంబాలకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని చెప్పి భూములు స్వాధీనం చేసుకున్నారని, అయితే ఇప్పటివరకు నష్టపరిహారం అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం ఎన్.కొంతలపాడు గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు చట్టప్రకారం రావాల్సిన నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరికి వినతిపత్రం సమర్పించారు.ఎన్.కొంతలపాడు గ్రామంలోని పేద ప్రజలకు గతంలో పట్టాలు మంజూరు చేసి భూములు కేటాయించారని రైతులు తెలిపారు.“పరిశ్రమల కోసం మా పొలాలు తీసుకున్నారు.. ఫ్యాక్టరీలు వస్తాయి, మా గ్రామ యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. కానీ భూములు తీసుకున్న తర్వాత, మాకు ఏ నష్టపరిహారం ఇవ్వలేదు మా గ్రామంలో ఎవరికీ ఉద్యోగ అవకాశాలు కూడా ఇవ్వలేదు. మాకు కూటమి ప్రభుత్వ కర్నూలు జిల్లా కలెక్టర్ ఉన్నత అధికారులే మాకు న్యాయం చేయగలరని వేడుకుంటున్నాము

దేవనకొండను కరువు మండలంగా ప్రకటించాలి

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందించాలి

దేవనకొండ, అక్టోబర్ 5 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-





దేవనకొండ మండలంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా మండలాన్ని కరువు ప్రభావిత మండలంగా ప్రకటించి, హంద్రీనీవా సుజల స్రవంతి ద్వారా సాగునీరు అందించాలని దేవనకొండ గ్రామ అభివృద్ధి కమిటీ కోరింది.ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. మండలంలోని 44 గ్రామాల్లో వర్షపాతం లోటుతో పంటలుఎండిపోతున్నాయని, చెరువులు, కుంటల్లో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
హంద్రీనీవా ద్వారా చెరువులు, కుంటలను నింపడంతో పాటు తాగునీటి సమస్యను పరిష్కరించాలని, పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నాయకంటి రాజు, కాకర్ల శాంతికుమార్, ప్రకాష్, షఫీ తదితరులతో పాటు బీజేపీ, బీసీ సంఘం, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.
“రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాలే మా లక్ష్యం. దేవనకొండకు సాగునీరు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తాం” అని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No.:2023/67888

పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 107 ఫిర్యాదులు



నంద్యాల క్రైం, అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):
పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ ఆదేశాల మేరకు సోమవారం అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఖాదర్ భాషా గారు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఫిర్యాదిదారుల నుంచి 107 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అడ్మిన్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో ఒక్కొక్కరిగా స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్దిష్ట గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

డాక్టర్ హేమలతకు జాతీయ స్థాయి 'ఛేంజ్ మేకర్స్' అవార్డు

అనంతపురం వైద్యురాలి సేవలకు జాతీయ గుర్తింపు



అనంతపురం ప్రతినిధి , అక్టోబర్ 05,(రిపబ్లిక్ న్యూస్):
సర్వజన వైద్యశాలలోని మదర్స్ మిల్క్ బ్యాంకులో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా సేవలందిస్తున్న డాక్టర్ హేమలతకు జాతీయ స్థాయి 'ఛేంజ్ మేకర్స్' అవార్డు లభించింది. వివిధ రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వ అనుసంధానంతో సమన్వయ ప్రతిష్ఠాన్ వడేదార్ స్వచ్ఛంద సంస్థ ఈ అవార్డులను అందిస్తోంది.
గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ఆదివారం నిర్వహించిన నేషనల్ ఛేంజ్ మేకర్స్ మీట్‌లో డాక్టర్ హేమలత అవార్డును అందుకున్నారు. సంస్థ వ్యవస్థాపకుడు అజయ్ రాంఖానా చేతుల మీదుగా ఆమెకు పురస్కారం ప్రదానం చేశారు.వైద్య రంగంలో సేవలతో పాటు మదర్స్ మిల్క్ బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను గుర్తించి ఆమెను ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అవార్డు అందుకున్న డాక్టర్ హేమలతను అనంతపురం సర్వజన వైద్యశాలకు చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది అభినందించారు.మదర్స్ మిల్క్ బ్యాంకు సేవలను మరింత విస్తరించడంతో పాటు సమాజానికి ఉపయోగపడే మరిన్ని కార్యక్రమాలు చేపట్టి భవిష్యత్తులో మరిన్ని పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

మామిడాలపాడులో అంబేద్కర్ దళిత సంఘం నూతన కమిటీ ఏర్పాటు

దళితుల ఐక్యతే అంబేద్కర్ ఆశయాల సాధనకు బలం: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు



కర్నూలు, ప్రతినిధి, అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు జిల్లా మామిడాలపాడు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దళిత సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏబీఈడబ్ల్యూబీసీ డైరెక్టర్, అడ్వకేట్ నాగముని హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ అంబేద్కర్ చూపిన రాజ్యాంగబద్ధమైన మార్గంలో దళితులంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దళితుల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం కోసం నూతన కమిటీ కృషి చేయాలని సూచించారు. గ్రామంలోని దళితుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు.అడ్వకేట్ నాగముని మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని, దళితుల సమస్యల పరిష్కారానికి సంఘటితంగా పనిచేయాలని సూచించారు.
నూతన కమిటీ: అధ్యక్షుడిగా తిరుపాల్, ఉపాధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా మాధవకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఖజాంచిగా గోవిందు, సభ్యుడిగా దానమయ్య ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులను నాయకులు అభినందించారు.

పిడుగు పడి విద్యుత్ ఉద్యోగి మృతి

వర్షం రావడంతో చెట్టు కిందకు వెళ్లగా ఘటన -పేలిన మొబైల్ ఫోన్



శింగనమల /పుట్లూరు, అక్టోబర్ 05,(రిపబ్లిక్ న్యూస్):
పిడుగు పడటంతో విద్యుత్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన విషాద ఘటన పుట్లూరు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గాండ్లపాడు గ్రామ శివారులో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.పుట్లూరు మండలం కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న చరణ్ (35) విధులు ముగించుకుని తన సమీప బంధువు దేవనందుతో కలిసి ద్విచక్ర వాహనంపై తాడిపత్రి వైపు వెళ్తున్నారు.
ఈ క్రమంలో వర్షం తీవ్రంగా కురవడంతో గాండ్లపాడు గ్రామ శివారులో వాహనాన్ని నిలిపి వర్షం నుంచి తప్పించు కునేందుకు చెట్టు కిందకు వెళ్లారు.అదే సమయంలో ఒక్కసారిగా పిడుగు పడటంతో చరణ్ తీవ్రంగా అస్వస్థతకు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. పిడుగు ప్రభావంతో ఆయన జేబులో ఉన్న మొబైల్ ఫోన్ పేలినట్లు స్థానికులు తెలిపారు. ఘటనతో దేవనందు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.చరణ్ 2019 నుంచి కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి, ఏఐటీయుసి డిమాండ్.



రైల్వేకోడూరు అక్టోబర్ 5 రిపబ్లిక్ న్యూస్.
మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించెందుకు కృషి చేయాలని ఏఐటీయూసీ రైల్వేకోడూరు నియోజకవర్గ సమితి కామ్రేడ్లుడిమాండ్ చేశారు, రైల్వేకోడూరు నియోజకవర్గంలోని చిట్వేలు మండలంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం మధ్యాహ్న భోజన కార్మిక సంఘం చిట్వేలు మండల కార్యదర్శి కామ్రేడ్ రెడ్డమ్మ అధ్యక్షతన జరిగింది, ఈ సమావేశంలో ఏఐటీయూసీ రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్షులు కామ్రేడ్ మాదరాజు గంగాధర్, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ దాసరి జయచంద్ర పాల్గొని కార్మికుల సమస్యలపై మాట్లాడారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు తక్కువ పారితోషికాలతో ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ ప్రభుత్వ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నారని, అయితే వారి శ్రమకు తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత వంటి కనీస హక్కులు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు,మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం పెంచాలని, డిఈఓ సంతకంతో గుర్తింపు కార్డులు ఇవ్వాలని, స్మార్ట్ కిచెన్ల ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించి ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు, మెస్ బిల్లులు చెల్లించాలని, కనీసం 20 రూపాయలకు తక్కువ లేకుండా మెస్ చార్జీలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి ఈఎస్ఐ, పిఎఫ్, వంటి సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, అలాగే వంటశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, వంట సామగ్రి, గ్యాస్ తదితర సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చాలని డిమాండ్ చేశారు,మధ్యాహ్న భోజన కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని, ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు,ఈ సమావేశంలో మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మమ్మ, శారద, వనజ, దేవి, శోభ, సునీత, ఈశ్వరమ్మ, గౌరమ్మ, సుబ్బమ్మ, పెంచలమ్మ, రాణమ్మ, పుష్పలత,వెంకట్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా ద్వారా పందికోన రిజర్వాయర్ నుంచి దేవనకొండ మండలానికి తాగునీరు విడుదల చేయాలి

:-మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు



దేవనకొండ అక్టోబర్5(ప్రజా రిపబ్లిక్ న్యూస్):-
దేవనకొండ మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు హంద్రీనీవా ద్వారా పందికోన రిజర్వాయర్ నుంచి తాగునీరు విడుదల చేయాలని కోరుతూ దేవనకొండ మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.మండలంలోని ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, పందికోన రిజర్వాయర్‌లో అందుబాటులో ఉన్న నీటిని హంద్రీనీవా ద్వారా దేవనకొండ మండలానికి విడుదల చేసి, ప్రజల తాగునీటి అవసరాలను తీర్చాలని రామచంద్ర నాయుడు కోరారు.
ప్రధాన డిమాండ్లు:. పందికోన రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ద్వారా దేవనకొండ మండలానికి తాగునీరు విడుదల చేయాలి. మండలంలోని అన్ని గ్రామాలకు సమగ్రంగా తాగునీటి సరఫరా కల్పించాలి.
తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలి.

మినీ స్టేడియంకు నిధులు మంజూరు చేయాలి

ప్రముఖ సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి



మల్లాపూర్ అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)
మల్లాపూర్ మండల కేంద్రంలోని మినీ స్టేడియంకు నిధులు వెంటనే మంజూరు చేయాలని మల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త ఏనుగు వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులకు మైదానములో సరైన వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారని, క్రీడాకారులకు మంచినీటి సౌకర్యం, ఫ్లడ్ లైట్ల సౌకర్యం, రోడ్డు సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు.

దివ్యాంగుల హక్కులు, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

అన్ని ప్రభుత్వ శాఖల్లో నిబంధనల మేరకు సౌకర్యాలు కల్పించాలి

జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేసి ఏడాదికి రెండుసార్లు సమావేశాలు నిర్వహించాలి జేసీ నూరుల్ ఖమర్



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
దివ్యాంగుల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన ప్రభుత్వ నిబంధనలు, సౌకర్యాలను జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారం, వారి హక్కుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల హక్కులు, సంక్షేమం, చట్టపరమైన నిబంధనలపై అధికారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూరుల్ ఖమర్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, ఏడాదికి కనీసం రెండుసార్లు సమావేశాలు నిర్వహించాలని సూచించారు. దివ్యాంగుల నుంచి వచ్చే ప్రత్యేక సమస్యలు, ఫిర్యాదులను ప్రత్యేకంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.
ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను పరిశీలించే సమయంలో దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రత్యేక సమస్యలు, అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు కల్పించాల్సిన 4 శాతం రిజర్వేషన్‌ను నిబంధనల మేరకు అమలు చేయాలని ఆదేశించారు.
ముఖ్యంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్), మున్సిపల్ కార్పొరేషన్, విద్యాశాఖతో పాటు పెద్ద సంఖ్యలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న అన్ని శాఖల్లో దివ్యాంగులకు 4 శాతం అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదేవిధంగా దివ్యాంగ ఉద్యోగులకు నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ప్రత్యేక సాధారణ సెలవులు (స్పెషల్ క్యాజువల్ లీవ్) తదితర సౌకర్యాలను కూడా వర్తింపజేయాలని సూచించారు.
ప్రతి ప్రభుత్వ శాఖలో దివ్యాంగులకు కల్పించాల్సిన సౌకర్యాలు, హక్కులు, ప్రభుత్వ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు. దివ్యాంగులకు సంబంధించిన అంశాలపై అన్ని శాఖలకు అధికారికంగా లేఖలు పంపించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు.
దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టంపై అవగాహన అవసరం
అంతకుముందు దివ్యాంగుల హక్కుల పరిరక్షణ చట్టం2016 పై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ యూనివర్సిటీ సోషియాలజీ ప్రొఫెసర్ అన్నవరం పి.పి.టి. ద్వారా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వివిధ్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రాయిస్ ఫాతిమా, డీఎంహెచ్‌వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ జఫ్రుల్లా, సీపీఓ భారతి, ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాధిక, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజా రఘువీర్, దివ్యాంగుల అసోసియేషన్ ప్రతినిధి ఎల్లప్ప, అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు, డ్రాప్‌అవుట్లపై ప్రత్యేక దృష్టి

10వ తరగతి ఫలితాల మెరుగుదలకు డివిజన్ వారీగా కార్యాచరణ జాబ్ మేళాల సంఖ్య పెంచాలి: కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, డ్రాప్‌అవుట్లు, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ, స్కిల్ డెవలప్‌మెంట్, అక్షరాంధ్ర తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలకు హాజరుకాని పిల్లలు, ఈ విద్యా సంవత్సరంలో చదువు మానేసిన విద్యార్థుల వివరాలను తరగతుల వారీగా స్పష్టంగా సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో సుమారు 41 వేల మంది 'అవుట్ ఆఫ్ స్కూల్' పిల్లలను గుర్తించినట్లు అధికారులు వివరించగా.. వారి వయస్సు, ప్రస్తుత స్థితిగతులు, 10వ తరగతి పూర్తి చేసిన వారు, వివాహమైన వారు తదితర వివరాలను వర్గీకరించి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని ఆదేశించారు.
10వ తరగతి ఫలితాలను మరింత మెరుగుపరిచేందుకు డివిజన్ వారీగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలలో ఏయే సబ్జెక్టుల్లో విద్యార్థులు తక్కువ మార్కులు సాధిస్తున్నారో గుర్తించి, ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతిరోజూ విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తూ తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.



స్టడీ అవర్స్, స్లిప్ టెస్టులు, రివిజన్ క్లాసులు క్రమం తప్పకుండా జరుగుతున్నాయా లేదా అనే అంశాన్ని ఎంఈఓలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన స్లిప్ టెస్ట్ ఫలితాల రికార్డులు, తక్కువ మార్కులు సాధిస్తున్న విద్యార్థుల జాబితా అధికారుల వద్ద అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఎఫ్ఏ-1 మార్కుల నమోదు పూర్తయిందని, అక్టోబర్ 20 నుంచి ఎఫ్ఏ-2 ప్రారంభం కానుందని అధికారులు వివరించగా.. ముందుగానే విద్యార్థులు వెనుకబడిన సబ్జెక్టులను గుర్తించి రివిజన్, డౌట్ క్లాసులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.
10వ తరగతిలో 61 నుంచి 100 మార్కుల మధ్య సాధించే విద్యార్థులను 'సైనింగ్ స్టార్స్'గా గుర్తిస్తున్నందున, వారి సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని తెలిపారు. ప్రస్తుతం సైనింగ్ స్టార్స్ శాతం తక్కువగా ఉందని, మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.మారుమూల ప్రాంతాల్లోనూ లీప్ యాప్ డౌన్‌లోడ్ లక్ష్యాలను సాధిస్తున్నప్పుడు జిల్లాలో ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయో సమీక్షించుకోవాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్ అంశాలను వెంటనే పరిష్కరించి 100 శాతం లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు. ఆటిజం సెంటర్ల నిర్మాణ పనులను నవంబర్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.
అక్షరాంధ్ర కార్యక్రమంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ అన్నారు. గతంలోనూ జిల్లా అక్షరాస్యత కార్యక్రమాల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని గుర్తుచేస్తూ, అదే స్థాయి ఫలితాలను కొనసాగించాలని సూచించారు.స్కిల్ డెవలప్‌మెంట్‌లో భాగంగా పీఎం విశ్వకర్మ పథకం అమలును మరింత విస్తరించాలని కలెక్టర్ ఆదేశించారు. తక్కువ పురోగతి ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. నిరుద్యోగ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్ మేళాల సంఖ్యను పెంచాలని, ప్రతి నియోజకవర్గంలో కనీసం మూడు నెలలకు రెండు మెగా జాబ్ మేళాలు నిర్వహించేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా యువతకు పరిశ్రమల్లో ప్రాక్టికల్ అనుభవంతో పాటు స్టైపెండ్, భవిష్యత్ ఉపాధి అవకాశాలు లభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి మించి ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.
సమావేశంలో సర్వ శిక్ష అభియాన్ పీఓ లోకరాజ్, ఆర్ఐఓ లాలప్ప, ఉపాధి కల్పన అధికారి దీప్తి, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ చంద్రశేఖర్‌రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి రాజ్‌కుమార్, రాయలసీమ యూనివర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ సిటీ ఫేజ్1 పనులు వేగవంతం చేయాలి

నెలాఖరులోగా రోడ్లు, డ్రెయిన్ల పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ డా. ఏ.సిరి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ అక్టోబర్ 5)
ఓర్వకల్లు మండలం కొమరోలు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న డ్రోన్ సిటీ ఫేజ్1 పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. డ్రోన్ సిటీ మొదటి దశలో చేపడుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రోన్ సిటీ ఫేజ్1లో భాగంగా చేపడుతున్న రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులను ఒప్పందంలో నిర్దేశించిన ప్రకారం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. నీటి సరఫరా పనులను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు.ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, సంప్ పనులను మరో నెలన్నరలోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా నిర్దేశిత గడువులను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల శాఖ అధికారి సంజీవ రాజు, ఏపీఐఐసీ అధికారి సందీప్, ఓర్వకల్లు తహసీల్దార్ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల ఇబ్బందులు చూసి గ్రామ సర్పంచ్ ముందడుగు

రెండు కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతులు

సంగారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)

హత్నూర: మండలం ముచ్చర్ల గ్రామంలో ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను గుర్తించిన గ్రామ సర్పంచ్ యాదగిరి ముందడుగు వేశారు. ముచ్చర్ల నుంచి దౌల్తాబాద్‌కు వెళ్లే రెండో ప్రధాన మార్గంలో సుమారు రెండు కిలోమీటర్ల మేర రహదారి మరమ్మతు పనులను చేపట్టారు.ముచ్చర్ల అంబేద్కర్ విగ్రహం నుంచి నస్తీపూర్ క్రాస్‌రోడ్డు వరకు ఉన్న రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కోతల సమయంలో వ్యవసాయ యంత్రాలు, వరి తరలించే ట్రాక్టర్లు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో పరిస్థితి మరింత



అధ్వానంగా మారుతోంది.ఈ సమస్యను గమనించిన సర్పంచ్ యాదగిరి గ్రామ పెద్దలు, రైతులు, యువకులతో కలిసి రహదారి మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. రహదారిపై ఉన్న గుంతలను పూడ్చడంతో పాటు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో రైతులు తమ వ్యవసాయ పొలాలకు ట్రాక్టర్లు, ఇతర యంత్రాలను సులభంగా తీసుకెళ్లేందుకు మార్గం సుగమమైంది.ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ రహదారి సమస్యను గుర్తించి మరమ్మతులు చేపట్టడం వల్ల రైతులు, వాహనదారులకు ఇబ్బందులు తగ్గాయని తెలిపారు. గ్రామ అవసరాలను గుర్తించి ఇలాంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు ఎరుకలి రాజు, సాకలి రాజు, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

టీ.వై.జె.ఎఫ్ నూతన సభ్యులకు ఐడీ కార్డులు, హెల్త్ కార్డుల పంపిణీ

అందోలు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నాగరత్నం, ఉపాధ్యక్షుడిగా పి. ప్రభు నియామకం



సంగారెడ్డి:జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 5: (రిపబ్లిక్ న్యూస్)తెలంగాణ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TYJF)లో నూతనంగా నియమితులైన సభ్యులకు ఐడీ కార్డులు, హెల్త్ కార్డులు, అపాయింట్‌మెంట్ లెటర్లను పంపిణీ చేశారు.TYJF రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనుగుల ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ సూచనలతో సంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల భాగయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అందోలు నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నాగరత్నం, ఉపాధ్యక్షుడిగా పి. ప్రభును నియమిస్తూ అపాయింట్‌మెంట్ లెటర్లు, ఐడీ కార్డులు, హెల్త్ కార్డులను అందజేశారు.అనంతరం నూతనంగా నియమితులైన నాగరత్నం, పి. ప్రభు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ్జీఖీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జితేందర్ రావు తనుగుల, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జెల్ల భాగయ్యలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తామని వారు తెలిపారు

సేవా మార్గంలో తోట రాజారాం దంపతులు

దుర్గామాత ఉత్సవ విగ్రహానికి రూ.50 వేల విరాళం

కుమారుడి జ్ఞాపకార్థం సామాజిక సేవలకు అంకితం.. మల్లాపూర్‌లో సేవా దంపతులుగ ప్రత్యేక గుర్తింపు.

మల్లాపూర్ అక్టోబరు 5 (రిపబ్లిక్ న్యూస్)

సేవ చేయాలంటే పదవి అవసరం లేదు.. సంపాదించిన దాంట్లో కొంత సమాజానికి తిరిగి ఇవ్వాలనే మంచి మనసుంటే చాలని నిరూపిస్తున్నారు మల్లాపూర్ మండలానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకులు తోట రాజారాంసరస్వతి దంపతులు.

మల్లాపూర్ మండలంలో ఇండియన్ గ్యాస్ సంస్థకు సంబంధించిన సేవా రంగంలో సుపరిచితులుగా ఉంటూ, అనేక సామాజిక, సేవా కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. తాజాగా దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించే దుర్గామాత ఉత్సవాలకు రూ.50 వేల విలువైన ఉత్సవ విగ్రహాన్ని అందించడం ద్వారా మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా.. గ్రామంలో వైకుంఠ రథం, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలకు ఫర్నిచర్, క్రీడాకారులకు, టోర్నమెంట్లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తూ, పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేదోడువాదోడుగా నిలుస్తున్నారు.

కుమారుడి జ్ఞాపకమే.. సేవకు స్ఫూర్తి

జీవితంలో తీరని విషాదాన్ని ఎదుర్కొన్న తోట రాజారాంసరస్వతి దంపతులు తమ కుమారుడి మరణం తాలూకు విషాదాన్ని గుండెల్లో దాచుకుని, ఆయన జ్ఞాపకార్థం సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడుతున్నారు. కుమారుడి పేరును సేవా కార్యక్రమాల ద్వారా చిరస్థాయిగా నిలపాలనే సంకల్పంతో పలు



సామాజిక కార్యక్రమాలకు సహకరిస్తున్నారు.

"మనిషి జీవితం శాశ్వతం కాదు.. కానీ మనం చేసే సేవ, మనం నాటిన మంచితనం మాత్రం ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలుస్తుంది" అన్న భావనతో వారు ముందుకు సాగుతున్న తీరు పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది.

మల్లాపూర్‌లో సేవకు మరో పేరు తోట రాజారామ్ దంపతులు.

మల్లాపూర్ మండలంలోని తోట రాజారాం సరస్వతి దంపతులు అంటే తెలియని వారు అరుదనే చెప్పవచ్చు. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, విద్యార్థులకు సహాయం చేయడం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పాటు అందించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరించడం వంటి సేవ కార్యక్రమాలతో వారు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు,

దుర్గామాత ఉత్సవ విగ్రహానికి రూ 55000 వేల విలువైన విరాళం అందించడం వారి దాతృత్వానికి మరో నిదర్శనం, తమ కుమారుడి జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల రూపంలో కొనసాగిస్తూ, వ్యక్తిగత విషాదాన్ని సామాజిక సేవగా మలుచుకుంటున్న ఈ దంపతుల సేవా స్ఫూర్తికి మల్లాపూర్ మండల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసిన చెరుకు ప్రతినిధుల బృందం

మల్లాపూర్ అక్టోబర్ 5 (రిపబ్లిక్ న్యూస్)



ఈరోజు హైదరాబాద్ లో మంత్రి నివాసంలో టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నేతృత్వంలో ముత్యంపేట చెరుకు ప్రతినిధుల బృందం శ్రీధర్ బాబును కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం మన ప్రాంతం నుండి కామారెడ్డి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును పంపితే దానికి 350 రూపాయలు అదనపు రవాణా ఛార్జీలు మన ప్రాంతం రైతులు నష్టపోయారని, అట్టి డబ్బులను తిరిగి రైతులకు ఇప్పించాలని కోరుతూ, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిసి విన్నవించడం జరిగింది. మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే రైతులకు డబ్బులు ఇప్పిస్తానని చెప్పడం జరిగింది .ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ సేల్ జాయింట్ కోఆర్డినేటర్ వాకిటి సత్యం రెడ్డి, బద్ధం సోమిరెడ్డి, ఇట్టెడి నారాయణరెడ్డి, సుంకట జీవన్ రెడ్డి, క్యాతం లింగారెడ్డి, ఎలేటి రాజారెడ్డి, పడాల గంగారెడ్డి, జాల రెడ్డి, ఎల్లేటి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ను శుభాకాంక్షలు తెలిపిన.. ఇటిక్యాల్ ప్యాక్స్ చైర్మన్ మరి పెళ్లి శ్రీనివాస్ గౌడ్ పాలక వర్గం



రాయికల్ మండలం అక్టోబర్,05(రిపబ్లిక్ న్యూస్)జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, డైరెక్టర్ లునూతన కార్యవర్గ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య ని జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి మమ్ములను ఎంపిక చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు ఎన్నికైన పాలకవర్గానికి సత్కరించి పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో అనేక పద్ధతి ఉన్నాయని ఆ పద్ధతి చెరపడానికే సహకార సంఘాలు ఏర్పడ్డాయని అలాంటి సహకార సంఘం రైతులకు అనేక సూచనలు ఇవ్వాలని వారి బాగోగులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని రైతుల సేవనే మాధవసేవ అదే విధంగా పనులు చేయాలని ప్రతి సభ్యులు సంఘ సభ్యులు బాధ్యతయుతంగా పనిచేయాలని ఇది ఒక బాధ్యతగా గుర్తించాలని ఆయన కోరారు

రాయికల్ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్గా సురకంటి రాజిరెడ్డి ఎన్నిక పట్ల అతనికి పలువురి అభినందనలు

రాయికల్ మండలం అక్టోబర్,05(రిపబ్లిక్ న్యూస్)

రాయికల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొండపల్లి రవీందర్రావు ఆధ్వర్యంలో ఈరోజు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసి మమ్ములను నియమించినందుకు శుభాకాంక్షలు తెలిపి పూల గుచ్చాము ఇచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కుమార్ వారికీ శుభాకాంక్షలు తెలిపారు రాయికల్ మాజీ సర్పంచ్ సురకంటి నారాయణ కొడుకు సురకంటి రాజిరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది గతంలో సురకంటి రాజిరెడ్డి సింగల్ విండో డైరెక్టర్ గా పలుమార్లు ఉన్నారు వ్యవసాయ రంగంలో అపారమైన అనుభవం ఉండి రాయికల్ సింగల్ విండో అభివృద్ధికి ఎంతో కృషి చేశారు అలాంటి రాజిరెడ్డి మార్కెట్ కమిటీలో డైరెక్టర్ ఉండడం ఎంతో ఆనందదాయకం అని రాయికల్ గుడేటి కాపు సింగిరెడ్డి రాజిరెడ్డి అభిప్రాయపడ్డాడు జగిత్యాల జిల్లా రాయికల్ వ్యవసాయ మార్కెటింగ్ చైర్మన్గా కొండపల్లి రవీందర్ రావు వైస్ చైర్మన్గా గుజ్జుల మోహన్ రెడ్డి ,సభ్యులు గా మారంపల్లి స్నేహ, మలోత్ గంగాధర్, గొల్లపల్లి నరేష్, కొత్తకొండ పెద్ద





లింగం,సురకంటి రాజిరెడ్డి,గడ్డం దీపక్ రెడ్డి, అంతడుపుల లక్ష్మణ్, సామల్ల వేణు,శ్రీనివాస్, కూరగాయల రవి, ఎండి ఇగ్బాల్,చైర్మన్ పిఏసి డిస్టిక్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ అగ్రికల్చరల్,చైర్పర్సన్ మున్సిపాలిటీ రాయికల్ మొత్తం 16 మంది సభ్యుల నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది వీరిని నియమించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ కు సంఘ సభ్యులు అలాగే డైరెక్ట్ గా నియమించబడ్డ సురకంటి రాజిరెడ్డి ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్గా సురకంటి రాజిరెడ్డి నియమించడం పట్ల రాజిరెడ్డికి పాలకవర్గానికి రాయికల్ గుడేటి కాపు సంఘం సభ్యులు అలాగే మాజీ సర్పంచ్ ఎద్దండి భూమరెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గన్నవరం ప్రభాకర్, రాయికల్ సింగల్ విండో అధ్యక్షుడు ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ నెంబర్ డాక్టర్ పిప్పోజి మహేందర్ బాబు,గడ్డం గంగారెడ్డి, పడిగే రాజిరెడ్డి, కాకర మారుతి రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి, గట్టు వెంకట నరసయ్య,గట్టు లక్ష్మీనరసయ్య ఎన్ ఎల్ జి,రాజ నరసయ్య, రమేష్ నరసయ్య,ఏలేటి తిరుపతిరెడ్డి, కాకరి శ్రీనివాస్ రెడ్డి రామన్నపేట రాజిరెడ్డి, దేవేందర్ రేడ్డి , హర్షవర్ధన్ రెడ్డి, దుగ్యాల రాజేశ్వర రావు, విద్యాసాగర్రావు, గట్టుపల్లి నర్సయ్య, గట్టుపల్లి నరహరి, వెంకటరమణ మెడికల్ అధినేతలు బుడికె గంగన్న, రాజశేఖర్, సుంకే శంకర్,మహమ్మద్ షంషీర్ బత్తిని బాబు గౌడ్ లు శుభాకాంక్షలు తెలిపారు

బంగారు కమ్మల కోసం వృద్ధురాలి దారుణ హత్య

రోకలిబండతో తలపై మోది హతమార్చిన దుండగులు

చెవులు కోసి కమ్మల అపహరణ

ప్రత్యేక బృందాలతో గాలింపు

అనంతపురం క్రైమ్, అక్టోబర్ 05,(రిపబ్లిక్ న్యూస్):

బంగారు కమ్మల కోసం ఓ వృద్ధురాలిని దుండగులు దారుణంగా హతమార్చిన ఘటన అనంతపురం నగరంలోని కొవ్వూరు నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న 80 ఏళ్ల హరిజన చిన్న నాగమ్మపై గుర్తుతెలియని వ్యక్తులు రోకలిబండతో దాడి చేశారు. తలపై తీవ్రంగా గాయపడిన ఆమె రక్తపు మడుగులో పడి అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలను అపహరించుకుని పరారైనట్లు పోలీసులు తెలిపారు.మధ్యాహ్నం సమయంలో ఈ ఘటన జరిగినట్లు



ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పత్రికా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ కరుణాకర్‌రావు మాట్లాడారు. మధ్యాహ్నం చిన్న నాగమ్మ ఇంట్లో ఉన్న సమయంలో దుండగులు ప్రవేశించి ఆమెపై దాడి చేసినట్లు తెలిపారు.బంగారు కమ్మల కోసమే హత్య జరిగినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని,సమాచారం



అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీం, ఇతర దర్యాప్తు బృందాలతో ఆధారాలను సేకరించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు నిందితుల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు డి.ఎస్.పి తెలిపారు. నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్ల సీఐల పరిధిలో దర్యాప్తు కొనసాగు తోందన్నారు.

ఘటనకు ముందు, అనంతరం అనుమానాస్పదంగా సంచరించిన వ్యక్తులు, వాహనాల వివరాలను సేకరిస్తున్నారు.ఇప్పటికే నగరంలో వరుస దొంగతనాలు, చైన్ స్నాచింగ్ ఘటనలతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో వృద్ధురాలి హత్య తీవ్ర కలకలం రేపింది. బంగారు నగల కోసం ఏకంగా ప్రాణాలు తీసిన ఘటన స్థానికులను భయాందోళనకు గురిచేసింది.

గోదావరి పుష్కరాల అభివృద్ధి కొరకు నియోజకవర్గ పరిధి లో నిధులు ఇవ్వాలని మంత్రి మంత్రి అడ్లురి లక్ష్మణ్ కుమార్ ను కోరిన ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

రాయికల్ మండలం అక్టోబర్ 05(రిపబ్లిక్ న్యూస్)



గోదావరి పుష్కరాల పైన జగిత్యాల కలెక్టరేట్ లో సమీక్ష సమావేశం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్న జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్

ఈ సందర్భంగా జగిత్యాల నియోజకవర్గ పరిధిలో గోదావరి పరివాహక ప్రాంతాల్లో అన్ని గ్రామాలకు గోదావరి పుష్కరాల సందర్భంగా జగన్నాద్ పూర్ బోర్నపల్లి మంగెల కమ్మునూరు రంగ సాగర్ చిత్రవేణి గూడెం రేకుల పల్లి చిన్న కొల్వాయి లకు పుష్కర ఘాట్లు మరియు రహదారులు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ కోరడం జరిగింది.

రాయికల్ మండలంలో పలువురు మరణించగా ఆయా కుటుంబాలను పరమర్శించిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి జీవన్ రెడ్డి

రాయికల్ మండలం అక్టోబర్,05(రిపబ్లిక్ న్యూస్)



జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం, మండలం లోని ధర్మాజీపేట్, కొత్తపేట్, ఆలూరు,రాజనగర్,అయోధ్య గ్రామాలలో అనారోగ్యంతో ఉన్న వారిని మరియు ఇటీవల మరణించిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి వీరి వెంట గోపి రాజిరెడ్డి,మైపాల్ రెడ్డి బిఆర్ ఎస్ కార్యకర్తలు నాయకులు ఉన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ప్రతి 15 రోజులకు ఇంజనీరింగ్ పనుల పురోగతిపై సమీక్ష

భూ కేటాయింపులకు ఈ-ఫైల్ ద్వారా నిర్దేశిత విధానమే పాటించాలి

పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా పూర్తి చేయాలి: కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, అక్టోబరు 05 (రిపబ్లిక్ న్యూస్)
జిల్లాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, నిర్మాణాలు పూర్తయిన ప్రాజెక్టులను వినియోగానికి సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అభివృద్ధి పనులు, భూ కేటాయింపులు, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఆధార్ నవీకరణపై పలు కీలక సూచనలు చేశారు. ఏ శాఖకైనా భూమి అవసరమైతే సంబంధిత హెచ్ఓడీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఈ-ఫైల్ రూపంలో కలెక్టర్‌కు రిక్విజిషన్ పంపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల అనంతరం మాత్రమే జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ల ద్వారా భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 52,133 మంది విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉన్నందున, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలను సమీప ఆధార్ కేంద్రాలు లేదా మొబైల్ కిట్లతో అనుసంధానం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 169 ఆధార్ కేంద్రాల వివరాలను చిరునామాలతో సహా డిఇఓ, డివి ఈవోలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేయాలని, ఇతర సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములనే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆళ్లగడ్డలోని బాలసదనంలో నివసించే చంటి పిల్లల భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎలక్ట్రికల్, సివిల్ పనులను పూర్తి భద్రతతో చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసదన్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పాత బావికి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం వంటి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈడబ్ల్యూఐడీసీ, సమగ్ర శిక్ష, మున్సిపాలిటీ తదితర శాఖలు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెచ్చేరువు వద్ద టాయిలెట్, నీటి వసతులు పూర్తయినందున సోలార్ ప్యానెల్స్, విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు నెడ్‌క్యాప్ ద్వారా అంచనాలు సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మహిళలు, గిరిజన మహిళల ఉత్పత్తులకు

‘వనస్య’తో మెరుగైన మార్కెటింగ్

స్థానిక ఉత్పత్తులకు మార్కెట్.. మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యం: కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, అక్టోబరు 05 (రిపబ్లిక్ న్యూస్)
మహిళలు, గిరిజన మహిళలు, స్థానిక ఉత్పత్తిదారులు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేయడమే ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ను కలెక్టర్ సందర్శించి, అక్కడ ప్రదర్శనకు, విక్రయాలకు ఉంచిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ, ధరలు, విక్రయాలు, మార్కెటింగ్ విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళలు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలకు అవసరమైన మార్కెటింగ్ సహకారం అందించడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు. స్థానికంగా తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ వేదిక అందుబాటులోకి రావడం వల్ల మహిళా సంఘాలు, గిరిజన మహిళలు, చిన్నతరహా ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరువ చేయగలుగుతారని పేర్కొన్నారు. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు మహిళా ఉత్పత్తిదారులకు అవసరమైన సహకారం అందించి, ‘వనస్య’ను సమర్థవంతమైన మార్కెటింగ్ వేదికగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోజువారీ విక్రయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలోని మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించేలా సోవెనీర్ లేదా గిఫ్ట్ ప్యాక్‌లను స్థానిక మహిళా ఉత్పత్తులతోనే రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ఉత్పత్తుల ఎంపిక, ప్యాకేజింగ్, ధరలను నిర్ణయించి, స్థిరమైన రేట్లతో ప్రత్యేక గిఫ్ట్ ప్యాక్ నమూనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వనస్య సెంటర్‌లో మహిళలు తయారు చేస్తున్న జ్యువెలరీ, జూట్ బ్యాగులు, పౌచ్‌లు, అలంకరణ వస్తువులు, ఇతర హస్తకళా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, వివిధ ఈవెంట్లలో వేదిక అలంకరణకు ఉపయోగించే చేరువ బొమ్మలు, ఇతర అలంకరణ ఉత్పత్తులు కూడా మహిళా సంఘాల ద్వారా తయారు చేస్తున్నందున వాటిని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అవసరానికి అనుగుణంగా జూట్ బ్యాగులు, పౌచ్‌లు తదితర ఉత్పత్తులను రెండు, మూడు రోజుల్లోనే ప్రత్యేక డిజైన్‌తో తయారు చేసి అందించే అవకాశం ఉందని తెలిపారు. మహిళా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థల ద్వారా బల్క్ ఆర్డర్లు వచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్, పాలిటెక్నిక్ తదితర కళాశాలల్లో వనస్య ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో బొకేలు, షాల్స్‌కు బదులుగా స్థానిక మహిళా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళల జీవనోపాధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకటదాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంతృప్తి స్థాయిపై ప్రత్యేక దృష్టి సారించాలి

లీఓపెన్ అర్జీలను మంగళవారం సాయంత్రంలోగా పరిష్కరించాలి


బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

పిజిఆర్ఎస్‌కు 326 దరఖాస్తులు - రెవెన్యూ క్లినిక్స్‌లో 145 అర్జీలు

జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, అక్టోబరు 05 (రిపబ్లిక్ న్యూస్)
ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతతో పాటు అర్జీదారులతో అధికారులు వ్యవహరించే తీరు, స్పందించే విధానం కూడా ప్రజా సంతృప్తిపై ప్రభావం చూపుతుందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజా సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ప్రభుత్వం నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. అధికారులు అందించిన పరిష్కారంపై ప్రశ్నలు అడిగిన అనంతరం మాత్రమే అర్జీదారులు తమ స్పందనను నమోదు చేసేలా వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో అధికారులు, సిబ్బంది మాట్లాడే విధానం, వారి ప్రవర్తన, స్పందించే తీరు వంటి అంశాలపై కూడా అభిప్రాయాలను సేకరిస్తున్నందున ప్రతి అధికారి ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి సుమారు 30 అర్జీలు రీఓపెన్ అయ్యాయని వాటన్నింటినీ మంగళవారం సాయంత్రంలోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లడం వల్ల జిల్లా ర్యాంకింగ్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భవిష్యత్తులో అర్జీలు బియాండ్ ఎస్-ఎల్ఏకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.





రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 145 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె వివరించారు. వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 5, అడంగల్ సవరణలకు 14, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఏ భూములకు సంబంధించి 7, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 56, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 28, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 32, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 3 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.


పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన కొన్ని అర్జీలు
1)రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బద్రి వెంకయ్య సర్వే నంబర్ 787/1ఎలో తనకు 3.95 సెంట్ల భూమి ఉందని, పొలానికి రహదారి సౌకర్యం లేదని, రహదారి ఏర్పాటు చేయడంతో పాటు సర్వే నంబర్‌కు సబ్ డివిజన్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
2)మిడ్తూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన చౌట్కూరు శేషిరెడ్డి సర్వే నంబర్ 441లో తనకు 7 ఎకరాల 13 సెంట్ల భూమి ఉందని, రీ-సర్వేలో 6 ఎకరాల 9.16 సెంట్లు మాత్రమే నమోదైందని, మిగిలిన భూమిని కూడా సర్వే చేసి హక్కును కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.
3)బేతంచర్ల మండలం కొలుమలపల్లె గ్రామానికి చెందిన జి. నాగభూషణం సర్వే నంబర్లు 122/1, 122/2, 122/3లోని భూములకు కొలతలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో హద్దులను నిర్ధారించి చూపించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపు, బడి బయట పిల్లలను

తిరిగి పాఠశాలల్లో చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి

నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, అక్టోబర్ 05 (రిపబ్లిక్ న్యూస్)
పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ కార్యక్రమాల అమలు తీరు, పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల రోజువారీ హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మిషన్ మార్చి-2027 లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఐవీఆర్ఎస్ విధానం ద్వారా పాఠశాలల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపు సమస్యను పరిష్కరించడంతో పాటు, జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై తదుపరి చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగిన తరగతుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, సమగ్ర శిక్ష కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, పీఎం సేతు, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్, ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్, స్కిల్ పోర్టల్ రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన బి ఓ సి డబ్ల్యూ, ఓఎం క్యాప్ తదితర కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాల ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ పొందిన అభ్యర్థులకు పరిశ్రమలు, వివిధ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన యువతకు పథకాల ప్రయోజనాలు చేరేలా విస్తృత అవగాహన కల్పించాలని, పోర్టల్ రిజిస్ట్రేషన్లలో పురోగతి సాధించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష పీఓ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఏసీ ఏ.డీ. సంతోష్, సీడాప్ జేడీఎం షాజహా తదితరులు పాల్గొన్నారు.

ఉదయానంద హాస్పిటల్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్

రూ.1,30,000/- నగదు స్వాధీనం



నంద్యాల క్రైం, అక్టోబర్ 5, (రిపబ్లిక్ న్యూస్):
పట్టణంలోని ఉదయానంద హాస్పిటల్‌లో నగదు దొంగతనం చేసిన నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ.1,30,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 04.10.2026తేదీన సాయంత్రం పట్టణంలోని నూనెపల్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద కోవెలకుంట్ల బస్ స్టాప్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కంభం వెంకటరెడ్డి, కడప జిల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు 19/20.09.2026 రాత్రి నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలోని ఉదయానంద హాస్పిటల్ క్యాష్ కౌంటర్ నుండి రూ.1,40,000/- నగదును దొంగిలించినట్లు వెల్లడించాడు. నిందితుడి వద్ద ఉన్న రూ.1,30,000/- నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.10,000/-ను తన వ్యక్తిగత ఖర్చులకు మరియు క్రికెట్ బెట్టింగ్‌కు వినియోగించినట్లు నిందితుడు వెల్లడించాడు. అదేవిధంగా, గిద్దలూరు పట్టణంలోని డి.జి.ఆర్ హాస్పిటల్ లో కూడా దొంగతనం చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. గతంలో నెల్లూరు జిల్లా బాలాజీనగర్ పోలీస్ స్టేషన్, పులివెందుల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి దొంగతనం కేసుల్లో నిందితుడిపై పలు కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని 04.10.2026 న సాయంత్రం 5.00 గంటలకు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి స్వాధీనం చేసుకున్న రూ.1,30,000/- నగదును కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం పోలీసుల స్వాధీనంలోకి తీసుకున్నారు. ఈ కేసులో నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో నంద్యాల త్రీ టౌన్ పోలీస్ సిబ్బంది, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, వారి సిబ్బందితో కలిసి సమన్వయంతో కృషి చేశారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com